# సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 2 । జూన్ । 2023






**మట్టి దందా**

చెరువు మట్టిని తరలిస్తూ ఓ వ్యక్తి అక్రమ దందాకు తెరలేపారు. రాత్రి సమయాల్లో పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. 8లో..



**సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు**

పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డబ్బు పోగొట్టుకున్నారు. 8లో..



**క్రీడలతో మానసికోల్లాసం**

క్రీడలతో మానసికోల్లాసం సొంతం అవుతుందని హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. 5కె రన్ విజేతలకు బహుమతులు అందించారు. 9లో..

## న్యూస్‌రీల్

### ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

మంత్రి హరీశ్‌రావు



బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నూతన బస్టాండ్ నుంచి సికిందరాబాద్‌కు 7 నూతన డీలక్స్ బస్సు సర్వీసులకు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు రద్దీకి అనుగుణంగా కొత్త సర్వీస్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సిద్దిపేట టు సికింద్రాబాద్‌కు ప్రతీ రోజు 42 నాన్ స్టాప్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని, అధునాతన సౌకర్యాలతో కూడిన పుష్ బ్యాక్ సీట్లతో కూడిన సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సుదర్శన్, సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### హుస్నాబాద్ ఆర్డీఓగా బెన్‌షాలోం



ఆర్డీఓ బెన్ షాలోంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

హుస్నాబాద్: హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా బెన్‌షాలోం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఇక్కడి ఆర్డీఓ జయచంద్రారెడ్డి బదిలీపై వెళ్లగా.. అప్పటి నుంచి ఇన్‌చార్జిలే బాధ్యతలు చూస్తున్నారు. హైదరాబాద్ సీసీఎల్ఏలో అసిస్టెంట్ సెక్రెటరీగా పని చేసిన బెన్‌షాలోంను హుస్నాబాద్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు



మాట్లాడుతున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. గజ్వేల్‌లో గురువారం నిర్వహించిన రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు అజీజ్, నాయకులు వజీర్‌ఖాన్‌లు మాట్లాడారు. డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చి రెండు వారాలు గడుస్తున్నా.. సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. డీలర్ల సమస్యలను కొద్ది రోజులుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నా స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేదంటే ఈ నెల 5 నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు వెంకటేశం, లక్ష్మారెడ్డి, మనోజ్, ప్రసాద్, మురళి పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలకు కాయకల్ప అవార్డులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు కాయాకల్ప అవార్డులు దక్కాయి. జిల్లాలోని ఏడు పల్లె దవాఖానాలకు రూ.50 వేల నగదు ప్రోత్సాహకం అందనుంది. పుల్లూరు పీహెచ్‌సీ ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఎంపిక కావడంతో రూ.2లక్షల నగదు బహుమతి అందనుంది. చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తిమ్మాపూర్, కుకునూరుపల్లి, మర్కూక్, గట్ల మల్యాల, రామవరం పీహెచ్‌సీలకు రూ.50వేల నగదు అందనుంది. సిద్దిపేట అర్బన్ నాసరపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2లక్షల నగదు, అంబేద్కర్ నగర్ యూపీహెచ్‌సీకి రూ.50వేల నగదు బహుమతిని కేంద్రం ప్రకటించింది.

# నాడు ఉద్యమంలో.. నేడు అభివృద్ధిలో



**ముందు వరుసలో నిలుస్తున్న సిద్దిపేట**

- నేటి నుంచి దశాబ్ది ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- జెండా ఆవిష్కరించనున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: నాడు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందున్న సిద్దిపేట... నేడు అభివృద్ధిలో ముందు నిలుస్తోంది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో జిల్లా ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. సాగునీటి బాధలు తీర్చేందుకు రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్‌లు, విద్యాభివృద్ధికి యూనివర్సిటీల ఏర్పాటు, మెడికల్ కళాశాలలతో మెరుగైన వైద్యంతో పాటు, పర్యాటకంగా దినదినాభివృద్ధి చెందుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అగ్రగామిగా నిలుస్తూ.. జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులను సాధిస్తూ ఆదర్శం నిలుస్తోంది. కాగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నేటి నుంచి ఈ నెల 22వ వరకు నిర్వహించే వేడుకలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తొలి రోజు మంత్రి హరీశ్‌రావు జెండా ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించనున్నారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించేలా అన్ని శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**రోడ్లు, రైల్వేలైన్ విస్తరణ**

- రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రూ.2,800 కోట్లతో మనోహరాబాద్(మేడ్చల్) టు కొత్తపల్లి(కరీంనగర్) 151 కిలో మీటర్ల రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించారు.
- మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు ఇప్పటికే గూడ్స్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలో సిద్దిపేటకు రైలు రానుంది.
- మిషన్ భగరీథ ద్వారా జిల్లాలో 725 ఆవాసాలకు 2లక్షలకు పైగా నివాసాలకు ప్రతీ రోజు తాగునీటి అందిస్తున్నారు.
- సిద్దిపేట పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు, రూ.160కోట్లతో కొండపాక మండలం దుద్దెడ వద్ద రింగ్ రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయి.
- మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి, దుద్దెడ-జనగామ రెండు జాతీయ రహదారుల నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

**అన్ని రంగాల్లో..**

- రాష్ట్రం ఏర్పాటయ్యాక కొత్త జిల్లాలు, నూతన మండలాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణంతో అన్ని కార్యాలయాలు ఒకే దగ్గర ఏర్పాటయ్యాయి.
- కొత్తగా 9మండలాలు, 99 పంచాయతీలు ఏర్పాటయ్యాయి.
- గతంలో ఒక మున్సిపాలిటీ, రెండు నగర పంచాయతీలుండగా, ప్రస్తుతం సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలుగా మారాయి. సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) కూడా ఏర్పాటు చేశారు.
- చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో 3టీఎంసీలతో రంగనాయకసాగర్, తొగుట మండలంలో 50 టీఎంసీలతో మల్లన్న సాగర్, మర్కూక్ మండలంలో 15 టీఎంసీలతో కొండపోచమ్మ రిజర్వాయర్‌ను నిర్మించారు.
- జిల్లాకు 2018-19లో మెడికల్ కళాశాల ఏర్పాటు కాగా, అనుబంధంగా 350 పడకల బోధన ఆస్పత్రి ఏర్పాటైంది.
- కేంద్రీయ విద్యాలయం, ఫారెస్ట్ కళాశాల, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ, మోడల్ స్కూల్‌లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటయ్యాయి.
- పశువైద్య కళాశాల ఇటీవలే మంజూరైంది. వచ్చే విద్యా సంవత్సరం తరగతులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- చేర్యాల, దుబ్బాక ప్రాంతాలను రెవెన్యూ డివిజన్‌లుగా ఏర్పాటు చేయాలని స్థానికుల నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి.
- గజ్వేల్ నియోజకవర్గం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామాన్ని మండలముగా చేయాలని స్థానికులు 300 రోజులుగా దీక్షలు చేస్తున్నారు.
- అక్కన్నపేట, హుస్నాబాద్‌లోని పలు గ్రామాలను పంచాయతీలుగా ప్రకటించాలని ఆందోళనలు కొనసాగుతున్నాయి.
- గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసిత వివాహిత మహిళలకు ప్యాకేజీ ఇవ్వాలని ఆందోళనలు జరుగుతున్నాయి.

**పర్యాటక కేంద్రంగా..**

- సిద్దిపేట కోమటి చెరువు వద్ద వేలాడే వంతెన, వాటర్ షో, నక్లెస్ రోడ్డు, నైట్ గార్డెన్‌తో సందర్శకులకు అడ్డాగా మారింది.
- రంగనాయకసాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు రూ.100కోట్లతో పనులు కొనసాగుతున్నాయి.
- పల్లెలు పట్టణాలు అభివృద్ధి చెందడంతో జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి.



- జిల్లాకు 15,820 డబుల్ బెడ్ రూంలు మంజూరవగా, 27,262 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 10,122 మందికి ఇళ్ల పంపిణీ జరుగగా, మరో 1,554 ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# చివరి శ్వాస వరకు మీకోసమే

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: మీరంతా నా కుటుంబం, మీకు ఎంత సేవ చేసినా తక్కువే.. నా చివరి శ్వాస వరకు మీకోసమే పనిచేస్తానని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం రాత్రి 22 వార్డులో రూ.20 లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్, రూ.50 లక్షలతో నిర్మించిన ఏకలవ్య భవన్, మహిళా సమాఖ్య భవన్, స్టీల్ బ్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా నోటి నుంచి కాదు అనే మాట రాకుండా నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే బలం ఇవ్వాలని ప్రతీ దేవుడిని కోరుకుంటా.. సీఎం కేసీఆర్ దీవెనలు, ప్రజల ప్రేమతో మరింతగా సేవ చేస్తానని పేర్కొన్నారు. సిద్దిపేటలో 54 కుల సంఘాలకు ఆత్మ గౌరవ భవనాలను అందించామన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళా పేరిట ప్రత్యేక ఆస్పత్రి ఏర్పాటు చేసి ప్రతీ మంగళవారం వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం అన్ని రంగాల్లో సిద్దిపేట అగ్రగామిగా ఉందని, త్వరలో హైదరాబాద్ టు సిద్దిపేట రైలు ఎక్కుతామని అన్నారు. ఈ ప్రాంత వాసులకు సముద్రం ఒడ్డు బీచ్ తరహాలో ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటు చేస్తున్నామని, డైనోసార్ పార్క్, శిల్పారామం, మల్టీప్లెక్స్ థియేటర్ అందుబాటులోకి వస్తుందన్నారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో 80 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, పట్టణ అధ్యక్షుడు సంపత్, కౌన్సిలర్లు తిరుమల్ రెడ్డి, మోహిజ్, అరవింద్, ప్రవీణ్, నాగరాజు, సాయి పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**రన్నింగ్ ట్రాక్ పరిశీలన**

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): అంతర్జాతీయ ప్రమాణాలతో ఐదు వరుసల అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్, సింథటిక్ టర్ఫ్‌తో క్రీడా ప్రాంగణం రూపురేఖలు మారాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో నిర్మితమవుతున్న అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్, సింథటిక్ ట్రాక్, గ్రీన్ టర్ఫ్‌లను గురువారం ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సదరు కాంట్రాక్టరుకు సూచించారు.

# బడిబాట విజయవంతం చేయాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యాసంవత్సర ప్రారంభం సందర్భంగా నేటి నుంచి 17వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోతిరెడ్డిపల్లి-పెద్దరాజుపేట గ్రామా ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌పై ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు కృష్ణవేణి, నూనె వెంకటేష్, ఎంపీటీసీ గూడూరు బాలరాజు, ఇన్‌చార్జ్ ఎంఈఓ మొగుళ్ళ నర్సింహ్మారెడ్డి, హెచ్‌ఎంలు కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

# నేడు గజ్వేల్‌లో మంత్రి పర్యటన



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం మంత్రి మంత్రి హరీశ్‌రావు శుక్రవారం పర్యటించనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మినీ క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు జన్మదినం పురస్కరించుకొని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి, కొండపాక, ములుగు, మర్కూక్, వర్గల్, గజ్వేల్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు అందిస్తారన్నారు. అనంతరం నాయిబ్రాహ్మణ, వీరశైవ లింగాయత్, గంగపుత్ర, మార్వాడి సంఘాలు, ఎల్ఎంవీ డ్రైవర్స్ యూనియన్, డీసీఎం డ్రైవర్స్, మేస్త్రీ సెంట్రింగ్, ఎలక్ట్రిషియన్, ఆటో వర్కర్స్, ఫొటో గ్రాఫర్స్, ల్యాబ్ టెక్నీషియన్, వెల్డింగ్ అసోసియేషన్‌లకు స్థలాలకు పట్టాలను అందిస్తారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, రైతు బంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవీ రవీందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీర, నాయకులు పాల్గొన్నారు.

# 10న దుబ్బాకలో మెగా జాబ్‌మేళా

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సింధు భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న దుబ్బాకలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా సంబంధ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 100కు పైగా కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 10న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోమటిరెడ్డి రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మేళా ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తయిన నిరుద్యోగులు హాజరుకావాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 7893335975 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, తదితరులు

# సొంతింటి కల నెరవేరుస్తాం

- తెలంగాణ వచ్చాకే గ్రామాల అభివృద్ధి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



మాటిండ్లలో డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం మల్యాల, జక్కాపూర్, మాటిండ్ల, గోపులాపూర్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. మల్యాల గ్రామంలో ఎంపీటీసీ హరీశ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన కూల్‌వాటర్ ప్లాంట్‌ను, గజాబౌలిని ప్రారంభించి, బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు.

**డప్పుచప్పుళ్లతో స్వాగతం..**

ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పుచప్పుళ్ల, బాణాసంచాతో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని, సీసీరోడ్లు, డబుల్‌బెడ్రూంలు, డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, పార్క్, జిమ్, మార్కెట్‌లు నిర్మాణమయ్యాయని అన్నారు. కాళేశ్వరం నీళ్లతో మండుటెండల్లో చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయన్నారు. రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేశామని, వారం రోజుల్లో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని అన్నారు. గతంలో బోరు బావులు తవ్వి నష్టపోయామని, గోదావరి నీటితో రెండు పంటలు పండించుకుంటున్నామని అన్నారు. నాటికి నేటికి జరిగిన మార్పును ప్రజలు గమనించాలని అన్నారు. మీరే నా బలం. బలగం. మీ ఆశీస్సులు, దీవెనలు ఉన్నంత కాలం మీ కోసం కష్టపడుతానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సర్పంచ్‌లు వజ్రవ్వ, పర్షరాములు, నారాయణ, రుక్కవ్వ, ఎంపీపీ బాలమల్లు, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు స్వప్న ప్రభాకర్, ఎంపీటీసీ హరీశ్, భాను, ఎంపీడీఓ, రైతుబంధు సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు నెలల్లో ట్రయల్ రన్

సిద్దిపేటఅర్బన్: రెండు నెలల్లో సిద్దిపేటలో రైలు ట్రయల్ రన్ ఉంటుందని, రైల్వే సేఫ్టీ అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి, నర్సాపూర్, మిట్టపల్లి వరకు రైల్వే ట్రాక్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దుద్దెడ-సిద్దిపేట రైల్వే ట్రాక్ పనులను అధికారులకు మంత్రికి వివరించారు. మందపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం జాప్యంపై ఆరా తీసి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని రైల్వే అధికారులకు మంత్రి సూచించారు. రైల్వే లైన్‌కు రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెంచాలని, అవసరమైన మొక్కలు ఇప్పిస్తామని అన్నారు. సిద్దిపేట-సిరిసిల్లా రైల్వే లైన్ పనులకు రూ.500 కోట్లు కేటాయించామని, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వారంలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. హన్మకొండ-మిట్టపల్లి రహదారి పై రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) నిర్మాణ పనులు ఎప్పటిలోపు పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. ఎల్కతుర్తి జాతీయ రహదారి నాలుగు వరుసలతో వస్తున్న దృష్ట్యా, రవాణా యధావిధిగా జరిగేలా సైడ్ లేన్ తీసుకుని ముందస్తు ఏర్పాట్లు చేయాలని రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. మంత్రితో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధన్ బాబు, సిద్దిపేట ఆర్డీఓ రమేశ్ బాబు, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ విజయ్ సాగర్ తదితరులు ఉన్నారు.



అధికారులతో కలిసి ట్రాక్ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## క్లుప్తంగా

### రావి ఆకుపై తెలంగాణ చిత్రాలు


రావి ఆకుపై శివకుమార్ మలిచిన చిత్రాలు



నారాయణఖేడ్: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవ వేళ.. మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై తెలంగాణ తల్లి, తెలంగాణ చిత్రం, అమరవీరుల స్థూపం, వీరుల శక్తి, ఐక్యతాచిత్రం, చార్మినార్, గోల్కొండ, బిర్లామందిర్ చిత్రాలను మలచి శుభాకాంక్షలు తెలిపారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. టౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని ఇందిరాకాలనీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 08455–27633, 8712656718 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

### నకిలీ పురుగు మందుల వ్యాపారి రిమాండ్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్ కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కొద్ది రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నకిలీ పురుగుల మందుల వ్యాపారి ఉదయ్‌జైన్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సదాశివపేట సీఐ నవీన్ కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ జైన్ గ్రామంలో అలామా ట్రేడర్స్ పేరుతో విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆత్మకూర్, పొట్టిపల్లి గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా, కాలం చెల్లిన పురుగుమందులు, లూజు విత్తనాలు, నిషేధిత గడ్డి మందులు, గోడౌన్లలో నిల్వ ఉంచాడు. వీటితో పాటుగా కాలం చెల్లిన 33 రకాల ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, చాక్లెట్స్, తేనె సీసాలు తదిరాలు నిల్వ చేయగా, వ్యవసాయ, ఫుడ్ సేఫ్టీ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడి చేసి ఐదు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటకలో ఉన్న ఉదయ్‌కుమార్ జైన్ అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. రూ.4.50 కోట్ల విలువ గల విత్తనాలు, పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. 30 లక్షల విలువైన కాలం చెల్లిన 33 రకాల ఆహార పదార్థాలు, శీతల పానీయాలు ధ్వంసం చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగలక్ష్మి తదితరులున్నారు.



# మట్టి దందా


చెరువులో మట్టి తవ్వకాలు ఇలా..

- ప్రహరీ నిర్మించి..ఆపై నిల్వ చేసి
- రాత్రి వేళ నగరానికి తరలింపు

ములుగు(గజ్వేల్): చెరువుమట్టి తరలిస్తూ ఒకరు దందాకు తెరలేపారు. రాత్రివేళ ఇతర ప్రాంతాలకు పంపిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. మేడ్చల్ జిల్లాలోని మైసమ్మగూడేనికి చెందిన ఒకరు మండలంలోని తున్కిబొల్లారం అయ్యప్పచెరువు, నాగుల చెరువు నుంచి ట్రాక్టర్లు, జేసీబీలతో మట్టిని తీయించి పరిసర గ్రామాల్లో గుట్టలుగా నిల్వ చేస్తున్నాడు. ఎకరం స్థలంలో చూట్టూ ప్రహరీ కట్టి మట్టినిల్వకు అడ్డాగా మార్చాడు. నిల్వచేసిన మట్టిని టిప్పర్లతో నగరానికి తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నాడు. చెరువు మట్టిని కేవలం పొలాలకు మాత్రమే తరలించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ అవసరాలకు విక్రయిస్తున్నారు.

**గ్రామస్తుల ఫిర్యాదు**

తున్కిబొల్లారంలో అక్రమంగా చెరువు మట్టిని తవ్వి తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, చెరువులను సంరక్షించాలని కోరుతూ గురువారం తున్కిబొల్లారం గ్రామస్తులు ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్, గ్రామస్తులు మధుసూధన్‌రెడ్డి, కిష్టారెడ్డి, మహేష్, బాబు తదితరులు విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా.. తున్కిబొల్లారం చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యవహారంపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. విచారణ చేసి బాధ్యులపై తీసుకుంటామన్నారు.


తున్కిబొల్లారంలో నిల్వ చేసిన చెరువు మట్టి

## బంధువుల పెళ్లికి వచ్చి... గుంతలో శవమై..


అశోక్ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): బంధువుల పెళ్లికి వచ్చిన ఓ వ్యక్తి గుంతలో శవమై తేలాడు. జగదేవ్‌పూర్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన దూళిమిట్టకు చెందిన లంబ అశోక్(26) బుధవారం జగదేవ్‌పూర్‌లో బంధువుల పెళ్లికి వచ్చాడు. బత్తుల ప్రభాకర్, శ్రీశైలం కలిసి కంబంబాయి కంచెలోకి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం అశోక్ మలవిసర్జన కోసం కంచె సమీపంలో గల గుంతలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు గుంతలో పడ్డాడు. గమనించిన స్నేహితులు అశోక్ కోసం వెతికారు. అదే సమయంలో తండ్రి శివ్వయ్య తన కుమారుడు అశోక్‌కు ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. అరగంట తర్వాత మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందని మృతుడి తండ్రి పేర్కొన్నాడు. రాత్రంతా అశోక్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. గురువారం ఉదయం కంబం బాయి కంచెలోని గుంతలో శవమై కనిపించిందని చుట్టుపక్కల వారితో పోలీసులకు సమాచారం అందిందన్నారు. వెంటనే ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. కొడుకు మృతిపట్ల పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి లోని దాచారం గ్రామానికి చెందిన అడుకని నవీన్(28) గేదె పొలం వద్ద కట్టేసి వస్తానని చెప్పి గురువారం రాత్రి నుంచి బయలుదేరాడు. ఎంతకూ ఇంటికి రాక పోవడంతో ఆందోళనకు గురైన భార్య మమత ఫోన్ చేస్తే వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నానని చెప్పాడు. తర్వాత మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మమత గ్రామంలో వెతకగా డంపింగ్ యార్డులో చీరతో ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

**హతమార్చారని తల్లిదండ్రుల ఆరోపణ**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ మూగ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే ఆ యువకుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ ఆరోపిస్తున్నారు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని నర్సింహతండాకు చెందిన మాలోతు రాజు–లలిత దంపతులకు ముగ్గురు సంతానం. రెండేళ్ల కిందటే ఐదేళ్ల కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది. పెద్దకుమారుడు మాలోతు ఆంజనేయులు(17)పుట్టుకతోనే మూగవాడు. బుధవారం తండాలో బంధువుల వివాహ వేడుక జరిగింది. మధ్యాహ్నం పెళ్లిలో భోజనం చేస్తున్న క్రమంలో ముగ్గురు భయపెట్టారని ఆంజనేయులు సైగల ద్వారా తన తల్లిదండ్రులకు వివరించాడు. రాత్రి 9గంటలు దాటినా ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతకగా, ఎక్కడా ఆచూకీ దొరకలేదు. గురువారం తెల్లవారుజామున గౌరవెల్లి రిజర్వాయర్ సమీపంలో తమకున్న వ్యవసాయ క్షేత్రం దగ్గర కట్టవద్దకు వెళ్లి చూసేసరికి వేప చెట్టుకు ఆంజనేయులు శవం వేలాడుతూ ఉంది. విషయం తెలుసుకొని పలువురు సంఘటన స్థలానికి వచ్చారు. తండాకు చెందిన కిషన్‌కు రాజుకు కొంతకాలంగా భూతగదాలు నడుస్తున్నాయి. ఇటీవల ఇద్దరిపై కేసులు నమోదు అయ్యాయి. అయితే పాతకక్షల నేపథ్యంలో తమ కుమారుడిని హతమార్చారని ఆంజనేయులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యమంగ హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


మాలోతు ఆంజనేయులు (ఫైల్)

## పాముకాటుకు రెండు ఆవులు మృతి




కోహిర్ (జహీరాబాద్): పాము కాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన మండలములోని మనియార్పల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు అందించిన సమాచారం ప్రకారం... మండల పరిధిలోని మనియార్పల్లిలో రైతు గొల్ల బాగన్న తన రెండు ఆవులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉంచాడు. పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాయి. స్థానికంగా ఉన్న వారితో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మరణించిన రెండు ఆవులు రూ.1.60లక్షలు ఉంటాయని రైతు వాపోయాడు.


సంఘటన స్థలం వద్ద బాధితులు

## పిడుగు పడి పాడిగేదెలు...

వర్గల్(గజ్వేల్): పిడుగుపాటుకు చెట్టుకింద కట్టేసిన రెండు పాడిగేదెలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి..వర్గల్‌కు చెందిన రైతు ఉప్పరి నర్సింలు పొలం వద్ద చెట్టు కింద పాడిగేదెలను కట్టేసి పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పిడుగుపడింది. దీంతో చెట్టు కింద కట్టేసిన రెండు పాడిగేదెలు దుర్మరణం చెందాయి. ఈ ఘటనలో తనకు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లింది.

# సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డబ్బు పోగొట్టుకున్నారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని పీజీఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మే 24వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేసింది. చివరికి తాను పెట్టిన రూ.2.80లక్షలకు రెట్టింపై నగదు ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో ఆ ఉద్యోగి తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ముకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 24వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలు నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్క్‌లు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.2.63 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్): చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..కుకునూరుపల్లి మండలంలోని సింగారానికి చెందిన గాలి గాలయ్య(40) కుటుంబీకులతో గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 29న కుకునూరుపల్లిలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. కొడకండ్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన గాలయ్యను 108లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


బోల్తాపడిన లారీ

## ధాన్యం లారీ బోల్తా

దుబ్బాక: దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ వద్ద ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం తిర్మలాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 938 బస్తాలను లోడ్ చేసుకుని ఓ లారీ తొగుట మండలం ఎల్లారెడ్డి పేట రైస్‌మిల్లుకు బయలుదేరింది. ఈ క్రమంలోనే తిర్మలాపూర్ – హైమద్‌నగర్ గ్రామాలకు వెళ్లే దారిలో లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ ఆరిఫ్ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుమారు 150 బస్తాల ధాన్యం సంచులు పగిలిపోయాయి.

## కారు ఢీ కొని ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు


పుష్ప మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

దుబ్బాకరూరల్: కారు చెట్టుకు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన దేవుని నర్సింలు తనభార్య పుష్ప(44), వదిన జెల్లా లక్ష్మిలతో కలిసి కారులో సిద్దిపేట జిల్లా బూర్గుపల్లి గ్రామంలో జరిగే బంధువుల పెళ్లికి హాజరయ్యారు. తిరిగి రామాయంపేటకు వస్తున్న క్రమంలో అక్బర్‌పేటభూంపల్లి మండలంలోని చిట్టాపూర్ శివారులోని రైస్‌మిల్లు వద్ద అతివేగంతో వెళుతున్న కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో పుష్ప అక్కడికక్కడే మృతి చెందింది. నర్సింలు, జెల్లా లక్ష్మిలకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వారిని 108లో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుష్ప మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రంజిత్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెట్టును ఢీ కొట్టిన కారు

## 20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. న పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ , బుధ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 20 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా, ఒకరికి రూ. 3 వేలు విధించారు.

**నారాయణఖేడ్‌లో...**

నారాయణఖేడ్: పట్టణంలో కొద్దిరోజులుగా పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 10మంది పట్టుబడ్డారు. వారిని జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి శ్రీధర్ రూ.35వేల జరిమానా విధించారని ఎస్‌ఐ వెంకట్ రెడ్డి గురువారం తెలిపారు. రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం

**సంగారెడ్డి జిల్లాలో వేర్వేరు చోట్ల .. వేర్వేరు కారణాలతో గురువారం ముగ్గురు అదృశ్యమయ్యారు.**


ప్రదీప్ (ఫైల్)

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సంగారెడ్డి సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బాబానగర్‌కు చెందిన పంబాల ప్రదీప్‌కుమార్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఇంట్లో నుంచి ఆటో తీసుకొని కొత్తిమీర కోసం పటాన్‌చెరు వెళుతున్నానని చెప్పాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కలవారికి, బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ప్రదీప్‌కుమార్ తల్లి ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**డ్యూటీకి వెళ్లి...**


సతీష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదంటూ ఓ భార్య ఫిర్యాదు చేసింది. భానూర్–బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం ..పటాన్‌చెరు మండలం చిటుకుల్ గ్రామ పరిధిలోని బాలజీ హోమ్స్‌కు చెందిన సతీష్ పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే మే 30వ తేదీన సతీష్ రాత్రి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి 31వ తేదీన ఇంటికి రాలేదు. భార్య శ్రీదేవి ఫోన్ చేయగా కొంచెం పనిఉందని పూర్తి చేసుకొని వస్తానని చెప్పాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భార్య శ్రీదేవి, కుటుంబసభ్యులు కలసి పరిశ్రమకు వద్దకు వెళ్లి అడగగా డ్యూటీ దిగి వెళ్లాడన్నారు. భర్త సతీష్ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**విందు ఉందని బయటకు వెళ్లి...**


ఉదయ్‌కిరణ్(ఫైల్)

నారాయణఖేడ్: ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ (22) గతనెల 29న రాత్రి 8గంటల సమయంలో గ్రామంలో విందు ఉందని చెప్పి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కల, తెలిసిన వారివద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువకుడి తండ్రి బుజ్జం కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.